క్లుప్తంగా

బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన మేకల వెంకటేశ్వర్లును బీఆర్ఎస్ పార్టీ కొప్పుల గ్రామశాఖ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తెలిపారు. అలాగే ఉపాధ్యక్షుడిగా మామిడి శంకర్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. తమ నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ జెడ్పీచైర్‌పర్సన్ జ్యోతితో పాటు పార్టీ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్ : హైదరాబాద్‌లో ఈనెల 26 నుంచి నిర్వహించే 41వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల టెన్నికాయిట్ పోటీల ఎంపికలను శుక్రవారం జేఎన్ఎస్‌లో నిర్వహించారు. 50 మంది బాలికలు, 50 మంది బాలురు పాల్గొన్నారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ వరంగల్, హనుమకొండ జిల్లా కార్యదర్శులు గోకారపు శ్యాంకుమార్, అల్వాల రాజ్‌కుమార్, కోశాధికారి జహుర్, పీఈటీ పాల్గొన్నారు.

సివిల్ ఇంజనీరింగ్ బీఓఎస్‌గా రాధిక

కేయూ క్యాంపస్: కాకతీ య యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ బోర్డు ఆఫ్ స్ట డీస్ చైర్‌పర్సన్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్.రాధికను నియమించారు. కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాధిక ప్రస్తుతం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అధిపతిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీసీ ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. రెండేళ్ల పాటు బాధ్యతలు నిర్వర్తిస్తారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 25న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. విష్ణుపురి కాలనీ, పోలీస్‌స్టేషన్, సాయి షాపూర్జీ కాంప్లెక్స్, సోమిడి, రహమత్‌నగర్, జూబ్లీ మార్కెట్, వెంకటాద్రినగర్, కాజీపేట మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

27న జరగాల్సిన జర్నలిజం రెండో పేపర్ వాయిదా

కేయూ క్యాంపస్ : యూజీసీ–నెట్ పరీక్ష దృష్ట్యా ఈనెల 27న జరగాల్సిన కాకతీయ యూనివర్సిటీ ఎంఏ (జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) మూడో సెమిస్టర్ రెండో పేపర్ వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య కె.రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఫిబ్రవరి 5న నిర్వహిస్తామని తెలిపారు. మిగతా పేపర్లు యథావిధిగా టైంటేబుల్ ప్రకారం జరుగుతాయని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

వరంగల్ అర్బన్ : హనుమకొండ హంటర్ రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్‌కు సమీపంలోని సర్వే నంబర్ 125/సీ లో అక్రమ నిర్మాణాన్ని బల్దియా అధికారులు కూల్చివేశారు. నగరంలో బడా వ్యాపారవేత్త, ఓ సామాజిక ఉద్యమకారుడి మధ్య నెలకొన్న ఈ భూ వివాదంలో హైకోర్టు ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు.హైకోర్టు ఉత్తర్వుల మేరకే నిర్మాణాలను కూల్చివేసినట్లు బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

ఐఎన్‌టీయూసీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్

వరంగల్ లీగల్ : ఐఎన్‌టీయూసీ ఫెడరేషన్ వరంగల్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా న్యాయవాది అనుమాండ్ల రాజ్‌కుమార్‌ను నియమిస్తూ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురహరి బుద్ధారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడి అధ్వర్యంలో అధ్యక్షుడు రాజ్‌కుమార్ జిల్లా కమిటీ వేశారు. ఉపాధ్యక్షుడిగా విక్రమ్, ప్రధాన కార్యదర్శిగా పొలాస శివకుమార్, ఆర్గనైజింగ్ సభ్యుడిగా భూక్యా రమేశ్‌లను నియమించగా వారికి బుద్ధారం నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫెడరేషన్ లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ నరసింహారాములు, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ మణికంఠ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శరణ్యారెడ్డి, ఉపాధ్యక్షులు రాజు, పాల్గొన్నారు.

శాశ్వత భవనం నిర్మించాలి

ఖిలా వరంగల్ : డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించాలని పర్యాటకశాఖ మంత్రి కొండా సురేఖకు వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వరంగల్ శంభునిపేటలో శుక్రవారం జరిగిన బాలికల దినోత్సవం వేడుకల్లో మంత్రి సురేఖ రాగా ఆమెకు వినతిపత్రం అందజేయడంతో పరిశీలిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

యూనిఫామ్‌తో పని ప్రదేశంలో గుర్తింపు

యూనిఫామ్‌తో పని ప్రదేశంలో ఉద్యోగులకు గుర్తింపుగా ఉంటుందని వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీలోని ఉద్యోగులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు.

గాయపరుస్తున్న ముళ్లచెట్లు

- రోడ్డు డివైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన కొమ్మలు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



పరకాల–హుజూరాబాద్ ప్రధాన రోడ్డు డివైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన ముళ్లచెట్లు

నడికూడ : సాధారణంగా రోడ్డు డివైడర్లు మొక్కలతో నిండుకుని పచ్చదనంతో అహ్లాదంగా కనిపిస్తుంటాయి. రాత్రి వేళల్లో వాహనాల వెలుతురును అడ్డుకోవడంలో పచ్చని మొక్కలు కీలక పాత్ర పోశిస్తాయి. కానీ పరకాల–హుజూరాబాద్ ప్రధాన రహదారి డివైడర్ మధ్యలో ముళ్లచెట్లు దర్శనమిస్తూ వాహనదారులను గాయపరుస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం పరకాల నుంచి హుజూరాబాద్ వరకు రెండు లైన్ల రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి, డివైడర్లు కూడా నిర్మించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఆయా గ్రామాల పరిధిలో పరకాల నుంచి హుజూరాబాద్ వరకు వివిధ రకాల మొక్కలను నాటారు. కానీ కొన్ని చోట్ల రోడ్డు డివైడర్ మధ్యలో ముళ్లచెట్ల కొమ్మలు పెరగడంతో వాహనదారులకు గాయాలు తప్పడం లేదు. ఇటీవల రాత్రి సమయంలో పరకాల నుంచి హుజూరాబాద్‌కు టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్న దంపతులకు ముళ్లచెట్టు కొమ్మ తగిలి కింద పడటంతో ఇరువురు గాయపడినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం. బైక్‌పై వెళ్తున్న క్రమంలో ముళ్లపొదలు తగిలితే భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డును కమ్మేసిన ముళ్లపొదలను, కొమ్మలను తొలగించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ముళ్లచెట్లు ఏపుగా పెరిగాయి



పరకాల–హుజూరాబాద్ ప్రధాన రోడ్డు డివైడర్ మధ్యలో పలుచోట్ల ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. అధికారులు దృష్టి సారించి వెంటనే రోడ్డు డివైడర్ మధ్యలో ఉన్న ముళ్లచెట్లను తొలగించాలి.

– నారగని రాకేశ్, నడికూడ

అధికారులు చర్యలు తీసుకోవాలి



ముళ్లచెట్ల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి చర్య తీసుకోవాలి.

– మేకమల్ల వెంకటేశ్, ముస్త్యాలపల్లి

వరప్రదాయినిగా దేవాదుల ప్రాజెక్ట్

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మ్యాప్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం

ధర్మసాగర్ : దేవాదుల ఎత్తిపోతల పథకం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలకు వరప్రదాయినిగా మారిందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని ధర్మపురం, మల్లక్‌పల్లి గ్రామాల నడుమ ఏర్పాటు చేయనున్న మల్లన్న గండి ఎత్తిపోతల పథకం ద్వారా లిఫ్ట్–3 పంపు హౌస్, పైప్‌లైన్ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి కృషి చేస్తున్నానని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంతో పాటు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న పాలకుర్తి, వర్ధన్నపేట, జనగాం, చేర్యాల నియోజకవర్గాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో దేవాదుల ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. మరో 18 నెలల్లో నియోజకర్గంలోని ప్రతీ ఎరానికి గోదావరి జలాలు అందిస్తానని స్పష్టం చేశారు. ఎత్తైన ప్రదేశంలో ఉన్న వేలేరు, ధర్మసాగర్, జఫర్‌గఢ్ మండలాలకు సాగునీరు అందించాలని ఎమ్మెల్సీగా ఉన్నప్పుడే మూడు లిఫ్టులను మంజూరు చేపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ, ఈఈ, డీఈ పాల్గొన్నారు.

నిహారికకు సన్మానం



ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన ఇసురం నిహారిక స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి సిల్వర్ కప్ సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేశ్ గౌడ్ శుక్రవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాకర సాంబయ్య, బండి సంపత్‌గౌడ్, రాజు, సరళ, సత్యం గౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

శివచరణ్‌రెడ్డిని కలిసిన నాయకులు

ఆత్మకూరు : యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో పరకాల నియోజకవర్గ యూత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు మాదాసి శ్రీధర్, ఆత్మకూరు మండల అధ్యక్షుడు తనుగుల సందీప్ కలిసి శివచరణ్‌రెడ్డిని సన్మానించారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి

శాయంపేట : హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో ఫిబ్రవరి 2న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన బీసీ బహిరంగ సభకు బీసీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని తీన్మార్ మల్లన్న టీం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సైకిల్ యాత్ర చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. బీసీ రాజ్యాధికార లక్ష్యంగా తీన్మార్ మల్లన్న పోరాటం చేస్తున్నారని అన్నారు. టీం మండల అధ్యక్షుడు తీన్మార్ జై, సభ్యులు వెంకటేశ్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

వర్షాకాలం నాటికి ముంపు నివారణ

- ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి



నాలా నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

హన్మకొండ: వర్షాకాలం నాటికి గోకుల్‌నగర్ ముంపును నివారించనున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హనుమకొండ గోకుల్ కూడలిలో రూ.5.50 కోట్లతో నిర్మించనున్న నాలా నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా వర్షాకాలంలో గోకుల్ నగర్ జంక్షన్ నుంచి గాంధీనగర్ ప్రధాన రహదారిలో వరద నీరు నిలిచి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సమస్యను తాను స్వయంగా చూసి చలించి స్మార్ట్ సిటీ నిధులు రూ.5.50 కోట్లతో నాలా నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సరళ సంపత్ యాదవ్, కార్పొరేటర్ స్వరూప రాణి, గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్, నాయకులు చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఖిలా వరంగల్: రహదారులపై ట్రాఫిక్ నింబంధనలు తప్పనిసరిగా పాటించాలని మట్టెవాడ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వరంగల్ ఉర్సు గుట్ట తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరిగాయి.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీను



పరకాల : మాట్లాడుతున్న అనిత

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- ముగిసిన గ్రామసభలు

శాయంపేట : పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గ్రామసభల్లో వెల్లడించిన అర్హుల జాబితా, దరఖాస్తు చేసుకున్నవారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. మండలంలోని శాయంపేట, పత్తిపాక, గోవిందాపూర్, కొప్పుల, రాజుపల్లి, సాదనపల్లి గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించగా శాయంపేట గ్రామసభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 26 నుంచి అమలు చేయబోతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూస్తానని తెలిపారు. జాబితాలో పేర్లు రానివారు గ్రామాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, ఏఓ గంగాజమున, ఏపీఓ అనిత, రాష్ట్ర మినిమం వేజ్ బోర్డు అడ్వైజర్ మెంబర్ చంద్రప్రకాశ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : రసాభాసలు, వాగ్వాదాలు, తోపులాట నడుమ కొనసాగిన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు ఎల్కతుర్తి, దామెర, బావుపేట, వల్బాపూర్‌తో పాటు మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో డీఆర్డీఓ మేన శ్రీను హాజరై ప్రజలతో మాట్లాడారు. గ్రామ సభల్లో స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ జగత్‌సింగ్, ఏడీఏ లక్ష్మీనారాయణ, ఏఓ రాజ్‌కుమార్, ఆర్ఐ సదానందం, సీఐ పులి రమేశ్, కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. అలాగే భీమదేవరపల్లి మండలంలోని ఎర్రబెల్లి, గొల్లపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరేశం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండలంలో ప్రజాపాలన గ్రామసభలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని తిరుమలగిరి, పెంచికలపేట, మల్కపేట గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా అర్హుల జాబితాలో పేర్లు లేకపోవడంపై పలువురు ఆందోళనకు దిగారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9,10,11,21 వార్డులకు మాదారం కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ సుష్మ, మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కౌన్సిలర్స్ జయంత్‌లాల్, పూర్ణాచారి, లావణ్య, సంతోశ్, తహసీల్దార్ భాస్కర్, కోఆప్షన్ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ రంజిత్, ఏఈఓ శైలజ పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : సంక్షేమ పథకాల అర్హుల జాబితాలో పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవాలని క్లస్టర్ ఆఫీసర్, ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని పులుకుర్తి, సీతారాంపూర్‌లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్ సమ్మిరెడ్డి, ఏపీఓ శారద, టీఏ ప్రిసిల్లా, ఏఈఓ అరుణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మల్లారెడ్డి, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : మండలంలోని లోక్యాతండా, ఎర్రబెల్లి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు శుక్రవారం కొనసాగాయి. లోక్యాతండాలో అధికారులు అర్హుల పేర్లు చదువుతుండగా తమపేర్లు లేవని కొంతమంది ఆందోళనకు దిగారు. కాగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు 125, రేషన్ కార్డులకు 76, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 15 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

పొగాకు రహిత సమాజాన్ని నిర్మించాలి

ఎన్‌సీడీసీఎల్ జిల్లా సభ్యులు రామచందర్, నరేష్



పొగాకు నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

దామెర : పొగాకు రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎన్‌సీడీసీఎల్ జిల్లా సభ్యులు రామచందర్, నరేష్ అన్నారు. మండలంలోని కోగిల్వాయి, వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ పొగాకు నియంత్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అవగాహన కల్పించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొగాకు పదార్థాలతో ప్రాణాంతక క్యాన్సర్ వ్యాధి సోకుతుందని అన్నారు. మత్తుకు అవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. పొగాకు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, రమేశ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచి ఆలోచనలే భవిష్యత్ సోపానాలు

సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్



మాట్లాడుతున్న దామోదర్

కమలాపూర్ : ఉన్నతమైన ఆలోచనలే గొప్ప భవిష్యత్‌కు సోపానాలని సీడబ్ల్యూసీ సభ్యుడు, మోటివేషన్ స్పీకర్ కజాంపురం దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో సీనియర్ సిటీజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు కన్జ్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సంస్కార వికాస శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యాతో పాటు సాంస్కృతిక, క్రీడా నైపుణ్యాలు, సామాజిక సేవా దృక్పథం, దేశభక్తి అలవర్చుకోవాలన్నారు. ఎవరి భవిష్యత్‌కు వారే అసలైన నిర్మాతలని అన్నారు. సీనియర్ సిటీజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్, ఎంజేపీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

వేలేరు : తోటి స్నేహితుడు అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబం ఆర్థిక కష్టాల్లో పడింది. విషయం తెలుసుకున్న స్నేహితులు తలోకొంత పోగుచేసి రూ.51వేలు ఆర్థికసాయం అందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పీచర గ్రామానికి చెందిన గుడికందుల రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రమేశ్ స్నేహితులు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.51 వేల నగదును ఆర్థికసాయంగా అందించారు.

ఆడపిల్లల చదువు సమాజానికి వెలుగు



వేలేరు : ప్రశంసపత్రం అందజేస్తున్న అధికారులు



దామెరలో..

డీఎల్‌పీఓ గంగాభవాని

వేలేరు : ఆడపిల్లల చదువు సమాజానికి వెలుగని డీఎల్‌పీఓ గంగాభవాని, తహసీల్దార్ కోమి అన్నారు. శుక్రవారం మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమాజానికి ఆడపిల్లల చదువు ఎంతో అవసరమని అన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ విమల, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి, పీఆర్ ఏఈ రూపావతి పాల్గొన్నారు.

దామెర : ఆడపిల్లల అభ్యున్నతికి కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయ బాలిక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు అన్నిరంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. బడీడు బాలికలను బడికి పంపి సంపూర్ణ విద్యను అందించే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని అన్నారు. ఉపాధ్యాయులు కోమల, ఆయాలు, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేకాధికారి సునీతా అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా జేవీవీ అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం బాలికల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. బాలికలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థినులు సందేశాత్మకత నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాములు, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పదవీకాలం

- 23 ఎజెండా అంశాలతో నేడు కౌన్సిల్ చివరి సమావేశం



పరకాల మున్సిపల్ కార్యాలయం

పరకాల : రెండు విలీన గ్రామాలు, 22 వార్డుల కౌన్సిలర్స్‌తో ఐదేళ్ల క్రితం (2020 జనవరి25న) ఎన్నికైన మున్సిపల్ పాలకవర్గ పదవీకాలం శనివారంతో ముగియనుంది. పరకాల మున్సిపల్ పాలకవర్గానికి చివరి కౌన్సిల్ సమావేశంతో పాటు ఆత్మీయ వీడ్కోలు పలికేందుకు మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. పట్టణ ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న కుక్కలు, కోతుల బెడద నుంచి కాపాడేందుకు నిధులు కేటాయింపు, వయస్సు కారణంగా పనిచేయలేని దుస్థితిలోఉన్న పారిశుద్ధ్య కార్మికుల స్థానంలో కొత్తగా వారి వారసులకు అవకాశం కల్పించడం, ప్రభుత్వం చేపట్టిన హరితహారం మొక్కల సంరక్షణ కోసం నిధుల కేటాయింపుతో పాటు మరో 20 అంశాలపై చర్చించి తీర్మాణం చేసేందుకు కౌన్సిల్ సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది. అయితే మున్సిపాలిటీలో నిధులు ఎక్కువగా లేకపోవడంతో కొత్తగా సీసీ, డ్రెయినేజీ పనుల వంటి అంశాలను చేర్చలేదని సమాచారం. కాగా ఈ సమావేశానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిసింది. అందులో భాగంగా మున్సిపాలిటీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సమాచారం.

అభివృద్ధిలో మార్క్ చూపించాం

ఐదేళ్ల పాలనలో పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించి మార్క్ చూపించాం. గత ప్రభుత్వం ద్వారానే కాకుండా నేడు కాంగ్రెస్ ప్రభుత్వ సహాయంతో కోట్లాది రుపాయాలు నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేశాం. సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం, మున్సిపల్ కొత్త భవనం, మార్కెట్ అభివృద్ధితోపాటు మోడల్ మార్కెట్ నిర్మాణం, దామెర చెరువు సుందరీకరణ తదితర పనులు చేపట్టాం. ఐదేళ్ల పాలనలో పట్టణ ప్రజల సహకారం మరువలేనిది.

– సోద అనిత, మున్సిపల్ చైర్‌పర్సన్

కాజీపేట జంక్షన్‌లో పోలీసుల తనిఖీలు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శుక్రవారం ముందస్తు జాగ్రత్తగా బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టింది. ప్లాట్‌ఫాంలు, స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద తనిఖీలు చేపట్టారు.